ఉద్యమ కెరటం భగత్‌సింగ్

- ఘనంగా 94వ వర్ధంతి
- నివాళులర్పించిన ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు




భగత్‌సింగ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఫార్మసీ విద్యార్థులు



బి.కొత్తకోటలో కాగడాలతో ర్యాలీ



కేవీపల్లె: కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె : ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో కోట్లాదిమంది భారతీయుల గుండెల్లో స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తిని రగిల్చి దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప సమరయోధుడు భగత్‌సింగ్ అంటూ పలువురు కొనియాడారు. ఆదివారం కామ్రేడ్ భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, జనవిజ్ఞానవేదిక జిల్లా కార్యదర్శి హరినాథ్‌శర్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ సర్వేపల్లె మాట్లాడుతూ...నేటి యువతకు భగత్‌సింగ్ పోరాటజీవితం స్ఫూర్తిదాయకమన్నారు. అతి చిన్న వయస్సులో పోరాటాల వైపు ఆకర్షితులై దేశ స్వాతంత్య్రం కోసం బ్రిటీష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో దడ పుట్టించి, తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన విప్లవ యువకిశోరం భగత్‌సింగ్ అన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ అనేక ప్రజా, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. రాష్ట్రంలోని కూటమిప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల కోసం భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు చేసి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. యువతను నమ్మించి, మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన పార్టీలకు తగిన గుణపాఠం చెప్పేందుకు భగత్‌సింగ్ లాంటి నాయకుల పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువత పోరాటాలకు నడుంబిగించి తద్వారా భారత రాజ్యాంగాన్ని కాపాడుకున్నప్పుడే ఇలాంటి నాయకులకు ఘనమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, అఖిఫ్, హనుమంతనాయక్, ప్రసాద్, సీఐటీయూ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయసాధనకు కృషి

దేశ స్వాతంత్య్రం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయులు సుఖ్‌దేవ్, రాజ్‌గురు, భగత్‌సింగ్‌ల బలిదానాలను స్మరించుకుంటూ, వారి పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ నాయకులు కోరారు. ఆదివారం శ్రీ కృష్ణ చైతన్య ఫార్మసీ కళాశాలలో భగత్‌సింగ్ 94వ వర్ధంతికి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల చరిత్రలను పాఠ్య పుస్తకాలలో చేర్చి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. అతి చిన్న వయస్సులో దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన వారి విగ్రహాలను పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎస్‌జేఏసీ అన్నమయ్యజిల్లా అధ్యక్షులు గంగరాజు, రాష్ట్ర కార్యదర్శి వి.ఉత్తన్న, బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు, లాయర్ కే.సోమశేఖర్, పోర్డ్ నరసింహులు, వార్డెన్ రామ్‌ప్రసాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు కాగడాలతో నివాళి

బి.కొత్తకోట: స్వాతంత్య్ర సమరయోధులు, విప్లవ వీరుడు భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాత్రి సీపీఐ, ఏఐటీయూసీ శ్రేణులు కాగడాలతో నివాళులర్పించారు. జ్యోతిచౌక్ లో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాగడాలను వెలిగించి ప్రదర్శన చేశారు. యుక్త వయసులో దేశం కోసం ఉరికంబాన్ని ఎక్కిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. అమరవీరుల ఆశయాలు సాధిస్తాం, ఇంక్విలాబ్ జిందాబాద్, విప్లవం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి జి.రఘునాథ్, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎం.అష్రఫ్‌అలీ, యువజన నాయకులు సక్కా.మహేష్, యస్.తంబయ్యశెట్టి,పి.మంజునాథ్ జి.వెంకటరమణ, నాగరాజు, జి.మంజునాథ్, గంగిరెడ్డి,వెంకటేష్, వెంకటరమణ, జి.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శప్రాయం

కేవీపల్లె : భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్‌ల జీవితం యువతకు ఆదర్శమని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని తిమ్మాపురంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్రం కోసం స్వరాజ్యం మా జన్మ హక్కు అని నడుం బిగించారని కొనియాడారు. 23 సంవత్సరాల యవ్వన దశలో ఉరికంబాన్ని ముద్దాడిన గొప్ప యుద్ధ వీరులు భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవులని కొనియాడారు. యవత వారి అడుగుజాడల్లో నడవాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠినచర్యలు

– డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు



మదనపల్లె : ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...మదనపల్లె పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో...క్రికెట్ బెట్టింగ్‌లు ఆడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెడుతున్నామన్నారు. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన పాత నేరస్థుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్‌లకు పాల్పడినా, గుంపులు గుంపులుగా కూర్చుని సెల్‌చూస్తూ బెట్టింగ్‌లు వేస్తున్నా...అలాంటి వారందరిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుటుంబసభ్యులు, తల్లిదండ్రులు, భార్యలు...తమ ఇంటిలోని వారు కానీ, పిల్లలు, భర్తలు క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారనే సమాచారం ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదుచేయవచ్చన్నారు. క్రికెట్ బెట్టింగ్ కారణంగా అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, డబ్బులు పోగొట్టుకున్న పలువురు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తుల సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. డయల్ 100, 112 కు లేదా 94407 94738కు సమాచారం అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

క్రికెట్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా

కేవీపల్లె : ఐపీఎల్ జరుగుతున్న నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ చిన్నరెడ్డెప్ప అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ క్రికెట్ మ్యాచ్‌ల బెట్టింగ్‌లపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పలు గ్రామాల్లో సంచరిస్తూ బెట్టింగ్ వ్యవహారాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. ఎక్కడైనా బెట్టింగ్‌లకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని కోరారు.

క్లుప్తంగా

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కేవీపల్లె : మండలంలోని వగళ్ల కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో 2025 - 2026 విద్యా సంవత్సరానికి గానూ 6, 11వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రన్సిపాల్ శ్రావణి తెలిపారు. అనాథ బాలికలు, బడిబయటి పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 11వ తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

కురబలకోట: మండలంలోని ముదివేడు క్రాస్ దగ్గరున్న కేజీబీవీలో ఆరవ తరగతి, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రఫియా పర్వీన్ కోరారు. మధ్యలో బడి మానేసిన వారు, డ్రాప్ ఔట్ విద్యార్థులతో పాటు పేదలు, అనాథలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ప్రవేశానికి అర్హులన్నారు. వచ్చే నెల 11లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ముగిసిన ఎన్‌పీటీఈఎల్ పరీక్షలు

కురబలకోట: నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్హాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్), మద్రాస్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్వయం పరీక్షలు మండలంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ముగిశాయి. ఆన్‌లైన్‌లో మూడు రోజులుగా జరుగుతున్న ఈపరీక్షలకు వివిధ ప్రాంతాల నుంచి అధ్యాపకులు, విద్యార్థులు 3,734 మంది హాజరయ్యారు. ఉత్తీర్ణులైన వారికి ఎన్‌పీటీఈఎల్ ఆన్‌లైన్ సర్టిఫికెట్‌ను అందజేస్తారని ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు.

అన్నదానం

కురబలకోట: మదనపల్లె పట్టణం అమ్మచెరువు మిట్ట వద్దనున్న వెలుగు దివ్యాంగుల పాఠశాలతో పాటు వృద్ధాశ్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకుడు కడప క్రాస్ నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం అన్నదానం చేశారు. అతని తండ్రి శిద్దారెడ్డి జ్ఞాపకార్థంగా కార్యక్రమం నిర్వహించారు. వెలుగు స్కూల్ నిర్వాహకులు ఉదయ్ మోహన్ రెడ్డి వీరిని అభినందించారు. అడవిపల్లె బయ్యారెడ్డి, డ్వాక్రా లీడర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నిషేధం నుంచి బీసీ కాలనీని తొలగించండి

బి.కొత్తకోట: దాదాపు 35 ఏళ్ల క్రితం తమకు పట్టాలు ఇచ్చిన ఇళ్ల స్థలాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని బి.కొత్తకోట బీసీ కాలనీ వాసులు విన్నవించారు. టీడీపీ నాయకులు గంజి మోహన, ప్రసాద్ లతో కలిసి టీడీపీ నియోజకవర్గ నాయకుడు దాసిరిపల్లి జయచంద్రారెడ్డిని కలిసిన కాలనీ వాసులు ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. నిషేధిత జాబితాలో పెట్టడం వల్ల తాము 35 ఏళ్లు గడిచినా అవసరాల కోసం విక్రయించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరగా ఆయన హామీ ఇచ్చారు.

జాతరలో అల్లర్లకు పాల్పడితే చర్యలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి గంగ జాతర్లు నిర్వహించనున్నారు. కుల మతాలకు అతీతంగా సామరస్యంగా పండుగను జరుపుకోవాలని ఎస్ఐ హరిహర ప్రసాద్ ఆదివారం ప్రజలకు సూచించారు. గంగ జాతరలో ఎవరైనా అల్లర్లు సృష్టించినా, గొడవలకు ప్రేరేపించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే మండలంలో అనుమానితుల్ని బైండోవర్ చేసి హెచ్చరికలు జారీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

తంబళ్లపల్లె: స్థానిక సొసైటీ బిల్డింగ్ వద్ద మనోజ్ క్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఆదివారం మదనపల్లె శ్రీ చిన్నపిల్లలు, జనరల్ ఆస్పత్రి, జోత్స్న మెటర్నటీ జనరల్ ఆస్పత్రి డాక్టర్లు సుబ్రమణ్యం, రేవతి, జోత్స్న రాయల్‌లు వైద్య శిబిరంలో పాల్గొన్నారు. సుమారు 96 మంది రోగులకు పలు రకాల పరీక్షలతో వైద్య చికిత్స చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రెడ్డెమ్మతల్లీ.. కరుణించమ్మా

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో సందడిగా మారింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కుకొన్నారు.

ఉచిత ఉపనయనాలకు పేర్లు నమోదు చేసుకోండి

మదనపల్లె సిటీ: శంకర బ్రాహ్మణ సహకార సేవా సంఘ ఆధ్వర్యంలో చేపట్టే ఉచిత ఉపనయనాలకు బ్రాహ్మణ వటువులు పేర్లు నమోదు చేసుకోవాలని ఆ సంఘ అధ్యక్షుడు వి.కోదండరామయ్య తెలిపారు. ఆదివారం స్థానిక కురవంకలోని శంకర బ్రాహ్మణ సహకార సేవ సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. మే 2వతేదీన మదనపల్లె మండలం చిప్పిలి సత్యనారాయణస్వామి ఆలయంలో ఉచిత ఉపనయనాలు జరుగుతాయన్నారు. ఇందు కోసం వచ్చే నెల 25వతేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రసాదరావు 9491521544, జి.ప్రకాష్ 9440133686, ఎం.రఘునందనరావు 9440270075ను సంప్రదించాలన్నారు.

పాల ఏకరిల ఐక్యత చాటుదాం

–రాష్ట్ర పాలఏకరి అధ్యక్షుడు రాజేంద్రనాయుడు



మాట్లాడుతున్న జన్నే రాజేంద్రనాయుడు

మదనపల్లె సిటీ: పాల ఏకరిల ఐక్యత చాటుదామని రాష్ట్ర పాల ఏకరి సేవా సమితి అధ్యక్షుడు జన్నే రాజేంద్రనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక క్రిష్ణానగర్‌లో సంఘ కార్యాలయంలో పాల ఏకరి సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం క్రిష్ణాపురంలో జరిగిన హత్య చేసిన వ్యక్తి, హత్యకు గురైన వ్యక్తి తమ కులానికే చెందినవారు కావడం బాధకరమన్నారు. ఇలాంటి హత్య సంస్కృతిని విడనాడాలన్నారు. శాంతియుత జీవనం సాగించాలన్నారు. ఈ సంఘటన కొన్ని రాజకీయపార్టీలు తమ కులాన్ని వాడుకున్నారన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలే తప్ప మిగతా సమయంలో రాజకీయాలు చేయరాదన్నారు.పాల ఏకరిలో ఐక్యమత్యం కోసం గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అందరూ కలిసి సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పాల ఏకరి సేవా సమితి అధ్యక్షులు చలపతినాయుడు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు మల్లికార్జునాయుడు, సోమల మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు నాగేశ్వరరావు, నాయకులు రత్నం నాయుడు, నాగరాజనాయుడు, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రైవేటీకరణను ఆపాలి

– సీఐటీయూ డిమాండ్



ఆర్టీసీ బస్టాండులో కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

మదనపల్లె : ఆర్టీసీ ప్రత్యక్ష, పరోక్ష ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ జిల్లా నాయకులు హరిశర్మ, ప్రభాకర్ రెడ్డి, నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో.. సీఐటీయూ అనుబంధ సంస్థ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రచురించిన బుక్ లెట్, కరపత్రాలను విడుదల చేసి ఆర్టీసి కార్మికులకు పంపిణీ చేశారు. విద్యుత్ బస్సుల కొనుగోలు పేరుతో ప్రైవేటు ఓనర్లకు పలు రాయితీలు ఇవ్వడాన్ని ఖండించారు. దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, ఈ బస్సులోని హెచ్చు చార్జీలవల్ల సామాన్యులు వీటిని ఉపయోగించే పరిస్థితి ఉండదన్నారు. వాటికంటే పల్లెవెలుగు బస్సులు పెంచితే ఉపయోగకరమన్నారు. అంతేకాకుండా ఎలక్ట్రిక్ బస్సుల వల్ల కాలుష్యం తగ్గుతుందనడంలో వాస్తవం లేదన్నారు. ఈ బుక్ లెట్స్ చాలా బాగున్నాయని, వాస్తవ పరిస్థితులు, సమస్యలపై ప్రచురించారని పలువురు కార్మికులు ఎస్‌డబ్ల్యూఎఫ్‌ను మెచ్చుకున్నారు. అలాగే ఢిల్లీలో జరుగనున్న ఆర్టీసీ చలో పార్లమెంటు నిరసన జయప్రదం కావాలని కార్మికులు పలువురు ఆకాంక్షించారు. ఆర్టీసీ కార్మికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వారిగోడును పెడచెవిన పెట్టడంతో దేశవ్యాప్తంగా తమ సమస్యలను పార్లమెంటుకు తెలుపుకోవాలని 24న ఛలోఢిల్లీ నిరసన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవాలన్నారు.లేని పక్షంలో ఆందోళన ఉధృతం అవుతుందని సిఐటీయు నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆఫ్రీది, జయబాబు, పవన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

పీలేరు : రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్‌తేజ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గాంధీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని తెలిపారు.

మానవత సేవలు స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న మావవత సంస్థ సభ్యులు

కలకడ : మానవత సంస్థ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయుడు పి.వి.రమణ అన్నారు. మానవత స్వచ్ఛందద సేవా సంస్థ నెలవారి సమీక్ష సమావేశాన్ని ఆదివారం కలకడ ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణంలో ఆ సంస్థ మండలశాఖ కార్యదర్శి వెంకటేశ్వర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు పి.వి రమణ మాట్లాడుతూ మండలంలో అనాథ మృతదేహాలకు మానవత సంస్థ అందించే ఉచిత సేవల్లో భాగంగా వాహనం కోసం అయ్యే ఇంధనం ఖర్చు ఏడాది మొత్తం భరిస్తానన్నారు. నెలవారి చేపట్టిన కార్యక్రమాలను సుధాకర్ వివరించారు. కార్యాలయ అభివృద్ధికి సభ్యులు సమష్టి కృషి చేయాలని కోరారు. మరిన్ని సేవలు అందించడానికి సభ్యులు అందరు కలిసి గ్రామాల వారి పర్యటించి దాతృత్వం కలిగిని వారిని సంప్రదిద్దామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వైవిరమణ, వెంకటసుబ్బయ్య, లక్ష్మన్న, జీవిరమణ, మోహన, కాజాఫీర్, వెంకట్రమణ పాల్గొన్నారు.

హెల్పింగ్‌మైండ్స్ లోగో ఆవిష్కరణ



హెల్పింగ్ మైండ్స్ లోగోను ఆవిష్కరిస్తున్న కడప అమీన్‌పీర్ దర్గా పిఠాధిపతి

పెద్దమండ్యం: హెల్పింగ్ మైండ్స్ 12వ వార్షికోత్సవ లోగోను కడప అమీన్‌పిర్ దర్గా పిఠాధిపతి అరీఫుల్లా హుసెనీ కలిచెర్ల మౌలాకా పహాడ్ వద్ద ఆదివారం ఆవిష్కరించారు. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబుబక్కర్ సిద్దిక్ అన్ని సేవా కార్యక్రమాలు ప్రతిబింబేలా ఉన్న డిజైన్ లోగోను మౌలాకా పహాడ్ వద్ద ఆవిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మదనపల్లె ముఖ్య కేంద్రంగా రక్తదానం, ఫుడ్‌బ్యాంక్, క్యాన్సర్ రోగులకు ఉచితంగా విగ్గులు, మూగజీవాలకు నీరు, ఆహార సదుపాయం, ఉచిత ఫ్రిజర్ బాక్స్ సేవలు, అనాద మృతదేహాలకు ఇలా పలు సేవాకార్యక్రమాలను ఆయన కొనియాడారు. హెల్పింగ్ మైండ్స్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పీఠాదిపతిని హెల్పింగ్ మైండ్స్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు సునీల్, పవన్, కిరణ్, బషీర్, చైతు, సాంబ లు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ చాంపియన్‌గా హ్యోత్రిశ్రీ



చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న హ్యోత్రిశ్రీ

పీలేరు : జేఎన్‌టీయూ–ఏ 12 ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ మీట్ 2025 బ్యాడ్మింటన్ (మహిళా విభాగం)లో పీలేరుకు చెందిన హ్యోత్రిశ్రీ చాంపియన్‌గా నిలిచింది. కలికిరి జేఎన్‌టీయూ కాలేజ్‌లో అనంతపురం జేఎన్‌టీయూఏ ఆధ్వర్యంలో గేమ్స్‌మీట్ 2025 నిర్వహించారు. ఇందులో భాగంగా బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ (మహిళా విభాగం)లో హ్యోత్రిశ్రీ అద్భుతమైన ఆటతో చాంపియన్‌గా నిలిచింది. తిరుపతి కేఎంఎం ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చేస్తున్న హ్యోత్రిశ్రీ బ్యాడ్మింటన్ పోటీల్లో అలవోకగా విజయం సాధిస్తూ రాణిస్తోంది. విజేతగా నిలిచిన హ్యోత్రిశ్రీకి కలికిరి జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రావు ట్రోఫీ అందజేశారు. క్రీడాకారిణి హ్యోత్రిశ్రీని ఆమె తండ్రి ప్రభాకర్‌రెడ్డి తోపాటు పలువురు క్రీడాకారులు అభినందించారు.

'అధికారులపై బురదజల్లడం మా నైజం కాదు'

పీలేరు రూరల్ : ప్రభుత్వ అధికారులపై కులం పేరుతో బురదజల్లడం మాలమహానాడు నైజం కాదని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణికుమార్ అన్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ భీమేశ్వర్‌రావు మండల మెజిస్ట్రేట్‌గా ఉండి రాజకీయ పార్టీల పట్ల, నాయకుల పట్ల అవహేళనగా మాట్లాడడం సబబు కాదన్నారు. ఈ నెల 18న స్థిరనివాసం పత్రం కోసం ఓ అర్జీదారునితో పాటు వెళ్లిన మాలమహానాడు నాయకుల పట్ల కనీస మర్యాద లేకుండా మాట్లాడారన్నారు. అధికారులు మా సంఘంపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తపాయి వెంకటేష్, మాలమహానాడ జెట్టి మల్లికార్జున, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుబ్బా శ్రీకాంత్, ఆటో యూనియన్ నాయకులు బోదేషా పాల్గొన్నారు.

పోలీసుల సేవలు ఆదర్శనీయం



మాట్లాడుతున్న ఎస్ఐ మధురామచంద్రుడు

గుర్రంకొండ: బదిలీపై వెళుతున్న పోలీసుల సేవలు అందరికి ఆదర్శనీయమని ఎస్ఐ మధురామచంద్రుడు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో పనిచేస్తున్న ఇద్దరు ఏఎస్ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఐదుగురు కానిస్టేబుళ్లు బదిలీపై జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లు వెళ్లారు. ఈనేపథ్యంలో ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్లో వారందకి ఎస్ఐ, స్థానిక పోలిస్‌స్టేషన్ సిబ్బంది పూలమాలలు, దుశ్శాలువలతొ ఘనంగా సన్మానించారు. ఈసందర్బంగా అయన ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఇక్కడ విధులు నిర్వహిస్తూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకొని బదిలీపై వెళుతున్న వారి సేవలు ఆదర్శనీయమన్నారు. ఉద్యోగంలో బదిలీ సర్వసాధారణమన్నారు. ఎక్కడ పనిచేసినా మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బొజ్జినాయక్, హెడ్‌కానిస్టేబుల్ నాగరాజనాయక్ పాల్గొన్నారు.

రెచ్చిపోయి డ్యాన్సులు వేస్తుంటే వాళ్లు ఏం చేస్తున్నట్లు ?

కురబలకోట: మండలంలోని ముదివేడు తిరునాళ్లలో రికార్డింగ్ డ్యాన్సుల భాగోతం కలకలాన్ని రేపుతోంది. వివాదాస్పదంగా కూడా మారింది. డ్యాన్సర్లు అసభ్యకరంగా డ్యాన్సులు వేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విచ్చల విడిగా వేసిన డ్యాన్సులు చూసి వామ్మో..అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. జిల్లాలో ఇది సంచలనంగానే కాకుండా వివిధ వర్గాల్లో చర్చనీయాంశంగా కూడా మారింది. తిరుణాలలో బరితెగించి డ్యాన్సర్లు డ్యాన్సులు వేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నట్లని వ్యక్తం చేస్తున్నారు. తిరునాలకు వంద మందికిపైగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సీఐలు, ఎస్ఐలతో పాటు మదనపల్లె సబ్ డివిజన్‌లోని వివిధ స్టేషన్‌ల నుండి పోలీసులు కూడా బందో బస్తుకు పెద్ద ఎత్తున వచ్చారు. రికార్డింగ్ డ్యాన్సర్లు మాత్రం రెచ్చిపోయారు. కేక పెట్టించారు. అనుమతి లేనప్పటికీ డ్యాన్సర్లు కుర్రకారుని హోరెత్తించారు. చూసిన వారు ఇవేం రికార్డింగ్ డ్యాన్సులరా బాబు..అంటూ నోటిమీద వేలేసుకున్నారు. ఇంత జరిగినా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది. సభ్య సమాజం సిగ్గుపడేలా నగ్నంగా డ్యాన్సులు వేయడం అత్యంత దారుణం. ఇలాంటివి కూటమి ప్రభుత్వానికి పట్టవా అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు చూసీ చూడనట్లుగా ఉంటారా..లేదంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటారా వేచి చూడాల్సిందే . రికార్డింగ్ డ్యాన్సులతో మొత్తానికి ముదివేడు పోలీసులు అభాసుపాలయ్యారనే చెప్పవచ్చు.

'ఉపాధి'లో బదిలీలు

- 13 ఏళ్లు మదనపల్లె వీడని కోర్స్ డైరెక్టర్ పీలేరుకు
- ఏడేళ్లు పనిచేసిన ఏపీఓకు మారని క్లస్టర్
- 9 మంది ఏపీఓల్లో ముగ్గురు తంబళ్లపల్లె నుంచే
- మళ్లీ యథాస్థానాలకు ప్రయత్నాలు

బి.కొత్తకోట: ఈనెల 19న జాయింట్ కలెక్టర్ సమక్షంలో డ్వామాలో పని చేస్తున్న ఉపాధి హామీ పథకం అధికారుల బదిలీలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. దీనికి సంబంధించి ఉత్తర్వులను జారీ చేశారు. ఈ బదిలీల్లో జిల్లాలోని 30 మంది ఏపీఓల్లో 9 మందిని మాత్రమే బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. కేవలం తొమ్మిది మందినే బదిలీ చేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నా..ఏపీఓలు జాయినింగ్ తేదీ ప్రకారమే జరిగిందని చెబుతున్నారు. అయితే ఈ బదిలీల్లో ఏళ్ల తరబడి పాతుకుపోయిన వాళ్లకు స్థాన చలనం కలిగింది. జిల్లాలోని బి.కొత్తకోట ఏపీఓ మంజుల కలికిరికి, కురబలకోట ఏపీఓ వెంకటేశ్వర్లు బి.కొత్తకోటకు, మదనపల్లె ఏపీఓ గుడి సుబ్రమణ్యం కురబలకోటకు, కలకడ ఏపీఓ చెన్నకేశవ మదనపల్లెకు, కలికిరి ఏపీఓ సుజాత కలకడకు, రామాపురం ఏపీఓ సురేంద్రరెడ్డి పెద్దమండ్యంకు, చిట్వేలి ఏపీఓ చంద్రకళ వీరబల్లికి, పెద్దమండ్యం ఏపీఓ మురళీమోహన్ చిన్నమండెంకు, వీరబల్లి ఏపీఓ నాగరాజు చిట్వేలికి బదిలీ అయ్యారు. వీరు కాక జిల్లా వ్యాప్తంగా 50 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 30 ఈసీలు, 41 మంది కంప్యూటర్ అపరేటర్లు, ముగ్గురు ఏంటీసీలు, ఐదుగురు సూపర్‌వైజర్లు, ఇద్దరు కోర్స్ డైరెక్టర్లు ఉన్నారు. ప్రస్తుతం వీరు పనిచేస్తున్న క్లస్టర్ నుంచి పొరుగున ఉన్న క్లస్టర్‌కు బదిలీ అయ్యారు. ఏపీడీల్లో ములకలచెరువు క్లస్టర్ ఏపీడీ మధుబాబు కలికిరికి, లక్కిరెడ్డిపల్లిలో పనిచేస్తున్న ఏపీడీ నందకుమార్ ములకలచెరువుకు బదిలీ అయ్యారు.

13 ఏళ్లకు బదిలీ

మదనపల్లె ఉపాధి కార్యాలయంలో కోర్స్ డైరెక్టర్‌గా చందన పని చేస్తున్నారు. జిల్లాలో ఏ అధికారి ఒకేచోట పని చేయనంత కాలం పనిచేసి రికార్డు సృష్టించారని డ్వామా సిబ్బంది చర్చించుకుంటున్నారు. చందన మదనపల్లెలో 13 ఏళ్ల 8 నెలల పాటు పనిచేయగా తాజా బదిలీల్లో పీలేరుకు బదిలీ చేశారు. కాగా ఈ బదిలీలకు మూడేళ్లు పూర్తిచేసి ఐదేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించినట్టు అధికారులు చెబుతున్నారు.బదిలీ అయిన అందరి సీనియార్టీ, సంబంధిత ప్రాంతంలో ఎప్పుడు నియమితులైంది, ఇతరా అంశాలను తీసుకుని పారదర్శకంగా బదిలీ ప్రక్రియ నిర్వహించారని చెబుతున్నా మిగిలిన 21 మంది ఏపీఓల్లో బదిలీ అయ్యే అవకాశం ఉన్నవాళ్లను తప్పించారన్న అనుమానాలు ఉపాధి సిబ్బందిలో వ్యక్తం అవుతోంది.

యథాస్థానాలకు ప్రయత్నాలు

కౌన్సిలింగ్‌లో ప్రస్తుతం బదిలీ అయిన వారు మళ్లీ యథాస్థానాలకు తిరిగి వచ్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. బదిలీ ఉత్తర్వులతో పని చేయాల్సిన చోటకు వెళ్లి విధుల్లో చేరాలి. అయితే రాజకీయ ఒత్తిళ్లతో మళ్లీ వారు పనిచేస్తున్న చోటకు వచ్చేందుకు బదిలీ రద్దు లేదా డిప్యూటేషన్ ఉత్తర్వులు తెచ్చుకునేందుకు అప్పుడే ప్రయత్నాలు ఊపందుకున్నాయి.

ఏడేళ్లయినా క్లస్టర్ బదిలీ తప్పింది

కురబలకోట ఏపీఓ వెంకటేశ్వర్లు ఏడేళ్లుగా పని చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో తంబళ్లపల్లె ఏపీఓగా 2-3 నెలలు పని చేశారు. దీనితో కౌన్సిలింగ్ నిర్వహించిన సమయంలో తనకు క్లస్టర్ బదిలీ వర్తించదని, తంబళ్లపల్లెలో పనిచేసిన కొంతకాలంకు సంబంధించిన ఉత్తర్వును అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.దీనితో ఏళ్ల తరబడి పనిచేసినా ఈ చిన్న నిబంధనతో క్లస్టర్ బదిలీ తప్పించుకుని బి.కొత్తకోట ఏపీఓగా నియమితులయ్యారు. కాగా జిల్లాలో బదిలీ జాబితాలో లేని 21 మంది ఏపీఓల్లో ఇలాంటి నిబంధనలతో బదిలీ నుంచి తప్పించుకున్నట్టు డ్వామాలో ప్రచారం జరుగుతోంది.